

అత్యాధునిక వైద్యం

ఏలూరు జిల్లా ఆసుపత్రి సర్వజన ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయ్యింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వాసులకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. 8లో ▸



హత్య కేసులో యావజ్జీవం

కాళ్ల మండలం ఏలూరుపాడుకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయినిని హత్య చేసిన కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు తీర్పునిచ్చింది. 8లో ▸



శాటిలైట్స్ తయారుచేయాలి

చంద్రయాన్–3 విలువైన సమాచారాన్ని అందిస్తోందని ఇస్రో పూర్వ శాస్త్రవేత్త వైబీఎన్ కృష్ణమూర్తి అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్‌లో ఆయన మాట్లాడారు. 8లో ▸

న్యూస్‌రీల్

రేపు పాలకొల్లుకు ఎంపీ మిథున్‌రెడ్డి రాక

పాలకొల్లు అర్బన్: ఎంపీ, వైఎస్సార్‌సీపీ ఉభయ గోదావరి జిల్లాల ఇన్‌చార్జ్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఈ నెల 31న పాలకొల్లు వస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు(గోపి) ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొల్లు పెదసాయిబాబా గుడి రోడ్డులోని అడబాల గార్డెన్స్‌లో ఉదయం 10.30 గంటలకు నియోజకవర్గస్థాయి వైఎస్సార్‌సీపీ సమావేశం జరుగుతుందన్నారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, అనుబంధ కమిటీలు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పార్టీ ఇన్‌చార్జ్ గుడాల గోపి కోరారు.

తమిళనాడు కేడర్ అధికారిగా సాగర్ బాబు



జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం జొన్నవారిగూడెం గ్రామానికి చెందిన యాళ్ళ సాగర్ బాబు తమిళనాడు, పాండిచ్చేరి కేడర్‌లో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ గ్రూప్–ఏ అసిస్టెంట్ కమిషనర్‌గా చెన్నైలో బాధ్యతలు స్వీకరించారు. సాగర్‌బాబు పదో తరగతి తాడువాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఇంటర్ జంగారెడ్డిగూడెం శంకరీ జూనియర్ కళాశాలలో, బీటెక్ వేగవరం నోవాలో చదివారు. 2022లో సాగర్‌బాబు సివిల్స్ చేశారు. అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సాగర్‌బాబుకు స్వగ్రామమైన జొన్నవారిగూడెంతో పాటు జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, స్థానికులు, అధికారులు అభినందనలు తెలిపారు.

తెలుగులో భీమవరం కోర్టు తీర్పు

సాక్షి, భీమవరం: తెలుగు భాషా దినోత్సవమైన మంగళవారం భీమవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్‌కుమార్ మూడు సివిల్ కేసులకు సంబంధించి తెలుగులో తీర్పునిచ్చి మాతృభాషాభిమానం చాటుకున్నారు. కక్షిదారులకు తమ కేసును ఎందుకు గెలిచామో, లేక ఓడిపోయామో అనేది అర్థం కావాలంటే సాధ్యమైనంత వరకూ తీర్పులు ప్రాంతీయ భాషలలోనే ఉంటే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతుండగా భారత ఉన్నత న్యాయస్థానం కూడా తీర్పులను ప్రాంతీయ భాషలలోకి అనువదించి అందిస్తోంది. ఇలాంటి తరుణంలో పవన్‌కుమార్ భీమవరం న్యాయమూర్తిగా వచ్చినప్పటినుంచి సాధ్యమైనంత వరకూ తీర్పులను తెలుగు భాషలోనే ఇస్తున్నారు.

వికాస్ పాఠశాల గుర్తింపు రద్దు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం వికాస్ ఇంగ్లీష్ మీడియం ప్రాథమికోన్నత పాఠశాల గుర్తింపును రద్దు చేసినట్లు ఎంఈవో–1 బి.రాముడు, ఎంఈవో–2 జి.రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలపై వివిధ స్థాయిల్లో వచ్చిన స్పందన ఫిర్యాదులు, జిల్లా, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ, తనిఖీ రిపోర్టుల ఆధారంగా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ పాఠశాల గుర్తింపు రద్దుచేశారన్నారు. ఆ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యాంసుందర్ పాఠశాల యజమాన్యానికి నోటీసులు జారీ చేశారన్నారు. పాఠశాల రికార్డులను ఎంఈవో కార్యాలయానికి తరలించినట్లు చెప్పారు. విద్యార్థుల తల్లితండ్రులు వారి పిల్లలను వేరే పాఠశాలలో చేర్పించుకోవాలని ఆ ప్రకటనలో తెలిపారు. టీసీలు స్థానిక ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

పాఠశాల గుర్తింపు రద్దును సస్పెండ్ చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని వికాస్ స్కూల్ డైరెక్టర్ ఊరకర్ణం జగన్నాథరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి విచారణ వరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆ ఉత్తర్వుల్లో హైకోర్టు పేర్కొందన్నారు.

కనీస వేతనం చెల్లించాలి



న్యాయసేవాభవన్‌లో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): ప్రతి కార్మికుడికి చట్ట ప్రకారం కనీస వేతనం చెల్లించాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి సూచించారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో మంగళవారం సాయంత్రం వివిధ షాపులు, సంస్థల్లో పనిచేసే కార్మికులతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ కనీస సదుపాయాలు కల్పించని పక్షంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శికి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. న్యాయ సాయం కావాలంటే న్యాయ సేవాధికార సంస్థ అందజేస్తుందని తెలిపారు.

ఫిషరీస్ కోర్సులకు క్రేజ్

- నూరు శాతం ఉపాధి అవకాశాలు
- దేశీయ, విదేశీ ఆక్వా కంపెనీల్లో మెరుగైన అవకాశాలు
- దేశంలో మూడో మత్స్య విశ్వవిద్యాలయం నర్సాపురంలో ఏర్పాటు
- ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా సీట్ల కేటాయింపు



ఫిషరీస్ యూనివర్సిటీ నమూనా భవనం

సాక్షి ప్రతినిధి, ఏలూరు: రాష్ట్రంలో ఆక్వా కల్చర్ ప్రధాన ఆదాయ వనరుగా మారింది. గత రెండు దశాబ్దాలుగా ఆక్వా రంగంలో పూర్తి స్థాయిలో ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో రూ.వేల కోట్ల వ్యాపారం జరుగుతోంది. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 15కు పైగా దేశాలకు ఏటా భారీగా ఎగుమతులు జరుగుతున్నాయి. ఇలాంటి ఆక్వా రంగాన్ని నిపుణుల కొరత వెంటాడుతుంది. దీనికి శాశ్వత పరిష్కారం చూపించేలా రాష్ట్ర ప్రభుత్వం ఫిషరీస్ గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులతో రాష్ట్రంలోనే మొదటిది, దేశంలోనే మూడో ఫిషరీస్ విశ్వవిద్యాలయం నర్సాపురంలో ఏర్పాటు చేశారు. ఫిషరీస్ గ్రాడ్యుయేషన్‌కు కోర్సుకు గత ఆరేళ్లుగా అత్యధిక డిమాండ్ ఉంది. నూరు శాతం ఉపాధి అవకాశాలు ఉండటం, అత్యధిక శాతం ప్రభుత్వ ఉద్యోగానికి ఆస్కారం ఉండటంతో బైపీసీ విద్యార్థులు ఈ కోర్సు వైపు దృష్టి సారిస్తున్నారు.

వెంటాడుతున్న నిపుణుల కొరత

అపార అవకాశాలున్న ఆక్వా రంగంలో సుస్థిర అభివృద్ధి, మెరుగైన సాంకేతికత సాధించడానికి ప్రొఫెషనల్ మ్యాన్ పవర్ అత్యధికంగా ఉంది. ప్రొఫెషనల్ మ్యాన్ పవర్ ఉంటే ఈ రంగంలో నష్టాలు కొంతమేరకైనా తగ్గించవచ్చు. సాంకేతికత కోసం ఇతర రాష్ట్రాలపై ఆధారపడకుండా ఆంధ్రప్రదేశ్‌లోనే ఆక్వా కోర్సులకు ప్రాధాన్యం ఇచ్చి అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం మత్స్య విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసింది. ఆక్వా రంగాన్ని నిపుణుల కొరత వెంటాడుతుంది. అంచనా ప్రకారం ఆక్వా సుస్థిర అభివృద్ధి కోసం ప్రస్తుత టర్నోవర్‌కు అనుగుణంగా 11,901 మంది పాలిటెక్నిక్ డిప్లమో హోల్డర్లు అవసరం ఉండగా కేవలం 600 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. 6,118 మంది బీఎఫ్ఎస్సీ గ్రాడ్యుయేట్లు అవసరం ఉండగా 700 మంది అందుబాటులో ఉన్నారు. 2,541 మంది ఎంఎఫ్ఎస్సీ పోస్టు గ్రాడ్యుయేట్‌లు అవసరం ఉండగా 80–100 మాత్రమే ఉన్నారు.

60 సీట్లతో నర్సాపురంలో వర్సిటీ ప్రారంభం

నర్సాపురంలోని సరిపల్లి– లిఖితపూడి గ్రామాల మధ్య 40 ఎకరాల విస్తీర్ణంలో రూ.303 కోట్ల వ్యయంతో మత్స్య విశ్వవిద్యాలయ పనులు మొదలయ్యాయి. మొదటి దశలో రూ.100 కోట్లు కేటాయించడంతో ప్రస్తుత నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. గతేడాది ఫిబ్రవరిలో విశ్వవిద్యాలయం కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో నెల్లూరు జిల్లాలోని ముత్తుకూరులో కాలేజీ ఆఫ్ ఫిషరీస్‌లో 45 గ్రాడ్యుయేషన్ సీట్లు , కృష్ణాజిల్లాలోని భావదేవరపల్లిలో ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాల, కాకినాడ, ఉండి బలభద్రపురంలో రీసెర్చ్ స్టేషన్లు ఉన్నాయి. కొత్తగా నర్సాపురంలో ఫిషరీస్ యూనివర్సిటీ 60 సీట్లతో ఈ ఏడాది ప్రారంభం కానుంది.

ఫిషరీస్‌లో మూడు కోర్సులు

1. ఫిషరీస్‌లో మూడు కేటగిరీ కోర్సులున్నాయి. 10వ తరగతి ఉత్తీర్ణత తరువాత ఫిషరీస్ డిప్లమో కోర్సు భావదేవరపల్లిలో ఉంది. దీనిలో 55 సీట్లు మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఇది రెండేళ్ల కాలపరిమితితో కూడిన కోర్సు.
2. ఫిషరీస్ గ్రాడ్యుయేషన్‌లో బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ (బీఎఫ్ఎస్సీ) నాలుగేళ్ల కాలపరిమితితో కూడిన కోర్సు. ముత్తుకూరు, నర్సాపురంలో మొత్తం 105 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
3. ముత్తుకూరు కళాశాలలో సుమారు 8–10 పీజీ సీట్లు, 5–7 పీహెచ్‌డీ సీట్లు అందుబాటులో ఉంటాయి. రెండేళ్ళ కాలపరిమితి ఉన్న పీజీలో ప్రస్తుతం 5 విభాగాల్లో ఉన్నాయి.

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది



ఆక్వా కోర్సులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిచ్చింది. ఈ ఏడాది నుంచి ఫిషరీస్ గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు పూర్తి చేసిన ముత్తుకూరులో ప్లేస్‌మెంట్ సెల్ ఏర్పాటు చేశాం. నర్సాపురంలో 60 కొత్త సీట్లు ఈ ఏడాది నుంచి ప్రారంభం కానున్నాయి. ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా సీట్లను పూర్తి చేసి వచ్చే నెల నుంచి తరగతులు ప్రారంభించనున్నాం.

– డాక్టర్ టీవీ రమణ, మత్స్య విశ్వవిద్యాలయ ఎగ్జామినేషన్ కంట్రోలర్

ఉపాధి అవకాశాలు పుష్కలం

గ్రాడ్యుయేట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేటు రంగంలో నూరు శాతం ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉండటంతో కోర్సు డిమాండ్ కొనసాగుతుంది. ప్రభుత్వ రంగ సంస్థలైన మత్స్యశాఖ, నేషనల్ బ్యాంకుల్లో స్పెషల్ ఆఫీసర్లు (ఫిషరీస్), నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్‌లో బీఎఫ్ఎస్సీ విద్యార్థులకు నూరు శాతం అవకాశాలున్నాయి. ఈ విద్యార్హత ఆధారంగానే మత్స్యశాఖలోని ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు (ఎఫ్‌డీఓ), అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్(ఏడీఎఫ్), విలేజ్ అసిస్టెంట్(ఫిషరీస్), నేషనల్ సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎంఎఫ్ఆర్ఐ), సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రాకిష్ వాటర్ ఆక్వా కల్చర్(సీబీఏ), సెంట్రల్ ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఐఎఫ్ఆర్ఐ), సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ(సీఐఎఫ్‌టీ), సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్(సీఐఎఫ్ఈ), సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఆక్వా కల్చర్(సీఐఎఫ్ఏ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ(ఎన్ఐఎఫ్ఓ), నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డులో ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయి. పీహెచ్‌డీ చేసిన వారికి విశ్వవిద్యాలయంలోనే అవకాశాలున్నాయి. హేచరీలు, ప్రాసెసింగ్ యూనిట్లు, ఆక్వా లేబొరేటరీలు, ఆక్వా ఉత్పత్తు కేంద్రాల్లో ఆకర్షణీయ జీతంతో కూడిన ఉపాధి అవకాశాలున్నాయి.

గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్‌కు నివాళి



ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి పంతులు సాధించిన విజయాల నుంచి స్ఫూర్తి పొందాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం స్థానిక స్పందన సమావేశం మందిరంలో ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతిలో ఆలోచించిన తొలి భాషా విజ్ఞాని గిడుగు రామ్మూర్తి పంతులు జన్మదినం తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని చెప్పారు. ఇదే రోజున జన్మించిన సుప్రసిద్ధ భారతీయ హాకీ ఆటగాడు ధ్యాన్ చంద్ పేరిట జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. గిడుగు రామ్మూర్తి జయంతి పురస్కరించుకొని జిల్లాలోని వివిధ పాఠశాలల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఐదుగురు తెలుగు భాషా పండితులకు మెమెంటోలను అందజేశారు. పురస్కారం అందుకున్న వారిలో డాక్టర్ పి.విజయకుమార్(ఆకివీడు,) టి.అప్పన్న (చినఅమిరం), కె.అచ్యుతరామ లక్ష్మీపతి దీక్షితులు(కరుగోరుమిల్లి), కె.శ్రీలక్ష్మీ(వీరంపాలెం) ఎ.రామసూర్యనారాయణ (తణుకు) తదితరులున్నారు. సమావేశంలో డీఆర్ఓ కె.కృష్ణవేణి, డీఈవో వెంకటరమణ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ బి.జాన్సన్ తదితరులున్నారు.

నేడు జాబ్ మేళా

ఏలూరు (టూటౌన్): ఈ నెల 30న ఉదయం 10 గంటల నుంచి ఏలూరు ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు తెలిపారు. బజాజ్ క్యాపిటల్ కంపెనీ ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. కస్టమర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్/టెలికాలర్‌గా పని చేయుటకు పదో తరగతి/ ఇంటర్ పాస్ 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఇతర వివరాలకు 99852 42040, 91827 72465 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ

ఏలూరు(మెట్రో): సచివాలయానికి వచ్చే ప్రజల అవసరాలను, సమస్యలను ఓపిగ్గా విని వారి సమస్యలు పరిష్కారానికి మార్గాలు చూపాలని కలెక్టరు ప్రసన్న వెంకటేష్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన గ్రేడ్–1 నుంచి గ్రేడ్– 5 పంచాయతీ కార్యదర్శులు 821 మందికి ఆరు అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సేవకులమనే విషయాన్ని మరవకుండా ప్రజలు వారి సమస్య చెప్పేదాకా ఓపిగ్గా వినాలన్నారు. జిల్లా స్థాయి స్పందనకు వచ్చే ప్రజలు తమ సమస్య పరిష్కారానికి సచివాలయంలో కార్యదర్శులు అందుబాటులో లేరనే మాట వినబడకూడదన్నారు. శిక్షణ కార్యక్రమంలో రెండు రోజులు రీ సర్వేపై ఇచ్చే శిక్షణను జాగ్రత్తగా విని ఫీల్డ్ పైకి వెళ్లినపుడు ఎలా మెలగాలో తెలుసుకోవాలన్నారు. పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన 821 మంది పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 29 నుంచి వచ్చే నెల 30 వరకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ రాయితీ చెక్కును అందజేస్తున్న మంత్రి కారుమూరి

తణుకు టౌన్: దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ, అభివృద్ధి పథకాలను రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని గీతామందిరంలో జరిగిన డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ రాయితీ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కారుమూరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో డ్వాక్రా రుణమాఫీ చేస్తామని, రైతులకు రుణ మాఫీ చేస్తామని హామీలు ఇచ్చి ఓట్లేయించుకున్న చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించారని విమర్శించారు. రుణాలు మాఫీ చేయకపోవడంతో మహిళలకు, రైతులకు రుణ భారం పెరిగిపోయిందన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళల రుణాలను దశల వారీగా రద్దు చేయడంతో పాటు వైఎస్సార్ ఆసరా, చేయూత, జగనన్న తోడు, సున్నా వడ్డీ వంటి పథకాలను అమలు చేస్తూ మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చారని చెప్పారు. చంద్రబాబు నాయుడు మాట మీద నిలబడని వ్యక్తి అని, ఇచ్చిన హామీలను ఏనాడు అమలు చేయని నాయకుడని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాట తప్పని, మడమ తిప్పకుండా ఎన్ని ఇబ్బందులెదురైనా ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తున్నారని చెప్పారు. తణుకు మండలంలోని 1685 డ్వాక్రా సంఘాల్లోని 16,895 మంది మహిళలకు రూ.2.42 కోట్లను వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీగా అందజేసినట్లు తెలిపారు.

యువతను రెచ్చగొడుతున్న లోకేశ్ : పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం అమలు చేయాలని అసెంబ్లీలోని 151 మంది ఎమ్మెల్యేలు తీర్మానం చేస్తే శాసన మండలిలో బలంగా వున్న టీడీపీ దానిని అమలు చేయకుండా అడ్డుకుందన్నారు. అయినా ప్రభుత్వం ముందుకు వెళ్లి ఇంగ్లీష్ మీడియం అమలు చేస్తుందని చెప్పారు. యువగళం పేరుతో రాష్ట్రంలోని యువతను లోకేశ్ రెచ్చగొడుతున్నారని చెప్పారు. ఎవరు ఎక్కువ కేసులలో ఉంటే వారికి అంత పెద్ద పదవులు ఇస్తానని చెప్పడం రాబోయే యువతను రౌడీలు, హంతకులుగా ముద్రవేయాలని లోకేశ్ కుట్ర పన్నుతున్నారని చెప్పారు. ఇటీవల పుంగనూరులో చంద్రబాబు ఆదేశాల మేరకే అక్కడ పోలీసులపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేశారని చెప్పారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, అతని దత్తపుత్రుడు యాత్రలు చేయడం ప్రారంభించడంతో రాష్ట్రంలో వర్షాలు ఆగిపోయాయని చెప్పారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణదేవి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మత్స రామరాజు, నియోజకవర్గ పరిశీలకుడు జక్కంశెట్టి రాజేంద్రప్రసాద్, వైస్ ఎంపీపీ బొశెట్టి శేషకుమారి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎస్ దుర్గాప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీలు చంద్రు శ్యామల, తాడిపర్తి సుజాత, పాలా వెంకట దుర్గ, ఏఎంసీ డైరెక్టర్ బండి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

కలెక్టర్ పి.ప్రశాంతి



భీమవరం నియోజకవర్గ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి, చిత్రంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాసు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, సమస్యల పరిష్కారంపై అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. భీమవరం నియోజకవర్గ సమీక్షా సమావేశం మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ నిర్వహించారు. పది అంశాలపై సమీక్షించారు. నియోజకవర్గంలో చేపట్టిన, చేయాల్సిన అభివృద్ధి పనులను కలెక్టర్‌కు ఎమ్మెల్యే వివరించారు. వాటిపై ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. తమ పరిధిలో ఉన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం ద్వారా అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయని అధికారులకు సూచించారు. ఇంతవరకు ఎన్ని ఇళ్లు పూర్తిచేశారో తెలుసుకుని మిగిలిన గృహాల పూర్తిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండాలని ఆదేశించారు. భీమవరం పట్టణంలో అమృత పనులు, 100 పడకల ఆస్పత్రి, మాస్టర్ ప్లాన్, తదితర వాటిపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నియోజవర్గంలో అభివృద్ధి పనుల్లో కూడా చురుగ్గా ఉండాలని సూచించారు. అభివృద్ధి పనుల పురోగతి, సమస్యలపై ఆయా శాఖల అధికారులకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పలు సూచనలు చేశారు. అనంతరం విలేకర్లు సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నియోజవర్గాల్లో అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తుమన్నారు. భీమవరం నియోజవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారం, సంక్షేమం, పాలన తదితర వాటిపై అధికారులతో సమీక్షించామన్నారు. స్థానిక ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వివరించిన అభివృద్ధి పనుల తోపాటు మాస్టర్‌ప్లాన్, 100 పడకల ఆస్పత్రి నిర్మాణం గురించి సమీక్షించామన్నారు. 100 పడకల ఆస్పత్రికి సంబంధించి ప్రభుత్వం రూ.10 కోట్లు కేటాయించగా మరో రూ.28 కోట్లు నాబార్డు సహకారంతో మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నర సంవత్సరాలైందని, పశ్చిమగోదావరి జిల్లాకు కేంద్రంగా భీమవరం ఏర్పాటు చేయడం అదృష్టమన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసి వేగంగా ఇళ్లు నిర్మించి ఇస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98 శాతం పూర్తిచేశారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, జెడ్పీ సీఈవో కె.రవికుమార్, సీపీఓ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే ఫలితాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి ప్రశాంతి, చిత్రంలో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: అభివృద్ధి, సంక్షేమాన్ని క్షేత్రస్థాయిలో సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేయడానికి నియోజకవర్గ సమీక్ష సమావేశం నిర్వహించామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్‌రెడ్డిలతో కలిసి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షించారు. పథకాల అమలులో లోటుపాట్లు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఫలితాలు సాధ్యమన్నారు. ప్రాధాన్యతా భవనాలు, గృహనిర్మాణం, అధిక వర్షాల నష్టాల అంచనా, పంచాయతీరాజ్, జలవనరులు, ఆర్‌అండ్‌బీ, పట్టణ ప్రణాళిక, విద్యుత్, రెవెన్యూ, గ్రామీణ నీటిపారుదల శాఖకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఆరాతీశారు. ఇంటి స్థలంకోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు 90 రోజుల కాలవ్యవధిలో పరిష్కారానికి కృషి చేయాలన్నారు. దర్భరేవు కంపెనీ భూముల్లో ఉన్న సమస్యలను తొలగించి లబ్ధిదారులకు మేలు చేయాలన్నారు. పలు గ్రామాల్లో శ్మశాన వాటికల ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. మోడి, వేములదీవి, కరింశెట్టిపాలెం, తూర్పుతాళ్లు మీదుగా లక్ష్మణేశ్వరం, రాజుల్లంక, దర్భరేవు రహదారి నిర్మాణం, నరసాపురం మున్సిపాలిటీ నుంచి లక్ష్మణేశ్వరం మీదుగా సారవ రహదారి నిర్మాణం, తీరం వెంట మెట్రీవు నుంచి అల్లంవారి మెరక, కెపీ పాలెం సౌత్ మీదుగా పేరుపాలెం సౌత్ రహదారి నిర్మాణానికి సుమారు రూ.15 కోట్లు మంజూరయ్యాయని వెంటనే టెండర్ల దశ పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రసాదరాజు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా వైద్య అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. యలమంచిలి, నరసాపురం మండలాల్లోని కాజ, ఈస్ట్‌కుక్కిలేరు, ముస్కేపాలెం అవుట్ ఫాల్ స్లూయిజ్‌లు, నీటిపారుదల తూములు నిర్మాణ పనులకు రూ.8.80 కోట్లు మంజూరు చేసుకున్నామని, త్వరగా టెండర్ల దశ పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలను ఎమ్మెల్యే సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

క్లుప్తంగా

'హైడ్రో డిస్టిలరీ' ప్రారంభం


యూనిట్ ప్రారంభంలో వీసీ టి.జానకీరామ్

తాడేపల్లిగూడెం: రైతులకు, పరిశోధకులకు సుగంధ మొక్కల నుంచి నూనె తీసే విధానం అందుబాటులో ఉండాలని ఉద్యాన వర్సిటీలో హైడ్రో డిస్టిలరీ యూనిట్ ఏర్పాటు చేసినట్టు ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ తోలేటి జానకి రామ్ అన్నారు. ఈ యూనిట్‌ను వీసీ మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిమ్మగడ్డి, గులాబీరేకులు, తులసి వంటి ఔషధ, సుగంధ మొక్కల నుంచి నూనె తీయడానికి ఈ యూనిట్ ఉపయోగపడుతుందన్నారు. ఒక క్వింటాల్ నిమ్మగడ్డి నుంచి ఒక లీటర్ నూనె తీయవచ్చన్నారు. ఈ నూనెకు ఔషధ, సౌందర్య పరిశ్రమలో చాలా డిమాండ్ ఉందన్నారు. దీని కోసం హైడ్రో డిస్టిలరీ డెమో యూనిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎల్.నారం నాయుడు, వెంకట్రామన్నగూడెం పరిశోధనా స్థానం హెడ్ పి.అశోక్ పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి రిమాండ్

ఆకివీడు: అత్యాచారం కేసులో నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఆకివీడు రూరల్ సీఐ కేవీవీఎస్ సత్యనారాయణ మంగళవారం చెప్పారు. కమతవానిగూడెంలో ఈ నెల 25న మేకలు మేపుకుంటున్న ఓ బాలికపై నిందితుడు కమతం సత్యం అత్యాచారం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు జరిపి ఈ నెల 28న నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

మెడికల్ కాలేజీ రాకతో..

అందుబాటులో ఆధునిక వైద్యం

- ఏలూరు జీజీహెచ్‌లో ఆధునిక సౌకర్యాలు
- భారీ నిధులతో వైద్యపరీక్షల పరికరాల ఏర్పాటు
- సర్వజన ఆసుపత్రిగా మార్పుతో వైద్య సేవల్లో గణనీయమైన మార్పులు

సాక్షి, పశ్చిమగోదావరి డెస్క్ : ఏలూరు జిల్లా ఆసుపత్రి నేడు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుసంధానంగా సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)గా అప్‌గ్రేడ్ అయ్యింది. దీంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వాసులకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఎంసీఐ అనుమతులతో ఈ ఏడాది ఎంబీబీఎస్ తరగతులు సైతం త్వరలో ప్రారంభం కానున్నాయి. మెడికల్ కళాశాల భవనాలు, బోధనాసుపత్రి ఆధునికీకరణకు సర్కారు ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తోంది. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల, సర్వజన ఆసుపత్రి, హాస్టల్ భవనాలు, ప్రొఫెసర్లు, అధికారులకు ప్రత్యేకంగా నివాస భవనాలు రాబోయే మూడేళ్లలో పూర్తిస్థాయిలో నిర్మాణం కాబోతున్నాయి. ఇందుకోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.525 కోట్ల భారీ నిధులను వెచ్చిస్తోంది.

● ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణంలో రూ.60 కోట్ల నిధులతో జీ+2 భవనాన్ని మెడికల్ కళాశాల కోసం నిర్మించారు. సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన నిర్మాణం చేపట్టారు.

● ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలో సుమారు 2.50 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ+5 భవనం శాశ్వత మెడికల్ కళాశాల కోసం శరవేగంగా నిర్మిస్తున్నారు. దీని నిమిత్తం రూ.78 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నారు.

● ఏలూరు జీజీహెచ్‌లో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తాత్కాలిక హాస్టల్, డైనింగ్ హాలు నిర్మాణం తుది దశలో ఉంది. ఎంసీహెచ్ భవనం పై అంతస్తులో రూ.20 కోట్ల వ్యయంతో దీనిని నిర్మిస్తున్నారు.

● ఏలూరు జీజీహెచ్‌లోనే బాలికలు, బాలురకు వేర్వేరుగా రెండు శాశ్వత హాస్టల్ భవనాల నిర్మాణం యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. వీటి నిర్మాణానికి సుమారు రూ.30 కోట్ల నిధులు వెచ్చిస్తున్నారు.

● ఏలూరు జీజీహెచ్‌లోనే బోధనాసుపత్రి కోసం శాశ్వత ప్రాతిపదికన జీ+4 భవన నిర్మాణం చేపడతారు. అత్యాధునిక వైద్య పరికరాలు, వైద్య చికిత్సలకు అనువుగా ఈ భవనాన్ని నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. హాస్పిటల్ ఏర్పాటుకు సుమారుగా రూ.120 కోట్ల నిధులు వెచ్చిస్తారని సమాచారం.


ఏలూరులోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ

బ్లడ్ కల్చర్ సిస్టమ్

కార్పొరేట్ హాస్పిటల్స్‌లో మాత్రమే ఉండే బ్లడ్ కల్చర్ సిస్టమ్ పరికరం ఏలూరు జీజీహెచ్ లోనూ ఏర్పాటు చేస్తున్నారు. నేటి ఆధునిక కాలంలో ఇష్టారాజ్యంగా యాంటీబయాటిక్స్ మందులు వినియోగిస్తున్న తరుణంలో రోగి ఏ మేరకు మందులు వేసుకోవాలో నిర్ధారిస్తారు. ఇలాంటి ఆధునిక పరికరం అతి తక్కువ హాస్పిటల్స్‌లోని ల్యాబ్‌ల్లో మాత్రమే అందుబాటులో ఉంది. సెల్ కౌంటర్ లేదా హీమోగ్రామ్, బ్లడ్ కల్చర్ పరికరాలు రోగులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు.


బ్లడ్ కల్చర్ పరీక్ష చేసే ఆధునిక పరికరం

ఫుల్లీ ఆటోమేటెడ్ ఎనలైజర్

అత్యాధునిక ఫుల్లీ ఆటోమేటెడ్ ఎనలైజర్ పరికరంతో రోగులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఈ పరికరంతో కిడ్నీ ఫంక్షన్ టెస్ట్, లివర్ ఫంక్షన్ టెస్ట్ చేసేందుకు ఉపయోగపడుతుంది. వ్యయప్రయాసలకోర్చి పేద రోగులు బయట పరీక్షలు చేయించుకునే పరిస్థితి లేకుండా, ఈ ఆధునిక పరికరంతో ఉచితంగా సేవలు పొందే అవకాశం ఉంటుంది.


ఫుల్లీ ఆటోమేటెడ్ ఎనలైజర్ పరికరం

ఏలూరు జీజీహెచ్‌లో ఆధునిక పరికరాలు

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలను ప్రభుత్వం కొనుగోలు చేసింది. థైరాయిడ్ హార్మోన్ టెస్ట్, సెల్ కౌంటర్, బ్లడ్ కల్చర్ సిస్టమ్, ఫుల్లీ ఆటోమేటెడ్ ఎనలైజర్, ఎలక్ట్రోలైట్స్ టెస్టింగ్, ఆటోమేటెడ్ కోయాగ్యులేషన్ ఎనలైజర్ ఇలా ల్యాబ్‌ల్లో పలు రకాల ఆధునిక పరికరాలు సమకూర్చారు. ఇదేస్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా ప్రారంభిస్తున్న వైద్య కళాశాలల అనుబంధ బోధనాసుపత్రులకు వీటిని అందజేసింది. ఈ పరికరాలకు ప్రత్యేకంగా ఏసీ, పటిష్టమైన విద్యుత్ సౌకర్యం, ద్రావణాలు, కిట్లు సమకూర్చాల్సి ఉంది. పరీక్షలు చేసేందుకు కిట్లు, ద్రావణాలు ఏ మేరకు కావాలో ప్రభుత్వానికి అధికారులు నివేదించారు. సౌకర్యాలు ఏర్పాటు చేశాక అన్ని పరికరాలూ ఇన్‌స్టాల్ చేసి ప్రజలకు సేవలు ప్రారంభిస్తామని, తొలి దశలో మూడు నెలలకు సరిపడా కిట్ల సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని బోధనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శశిధర్ తెలిపారు.


ఏలూరు జీజీహెచ్ ల్యాబ్‌లో థైరాయిడ్ పరీక్షల పరికరం

అందుబాటులోకి థైరాయిడ్ టెస్ట్ పరికరం

ఏలూరు జీజీహెచ్‌లో థైరాయిడ్ టెస్ట్ పరికరాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గతంలో థైరాయిడ్ టెస్టింగ్ పరికరం హాస్పిటల్‌లో లేదని, బోధనాసుపత్రిగా అప్‌గ్రేడ్ కావటంతోనే ఈ పరికరం అందుబాటులోకి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. టెస్టింగ్ కిట్లు ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనంతరం పరీక్షలు ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. సాధారణ ప్రజలు థైరాయిడ్ పరీక్షకు భారీగానే ఖర్చు చేయాల్సి ఉంటుంది. కానీ జీజీహెచ్‌లో ఏర్పాటు చేయటంతో ఉచితంగా పరీక్షలు చేయించుకునే అవకాశం ఏర్పడుతుంది.

ప్రజలకు ఆధునిక వైద్య సేవలు



“ఏలూరు బోధనాసుపత్రిలో ప్రజలకు మెరుగైన ఆధునిక వైద్య సేవలు, చికిత్సలు, పరీక్షలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే అన్ని ఆధునిక పరికరాలూ వినియోగంలోకి తీసుకువస్తాం. ప్రభుత్వం సమకూర్చిన ఆధునిక పరికరాలతో రోగులకు మరింత ఆధునిక వైద్య పరీక్షలు అందుబాటులోకి తెస్తాం. ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలే ప్రభుత్వ లక్ష్యం.

– డాక్టర్ ఎం.శశిధర్, సూపరింటెండెంట్, మైక్రోబయాలజీ ప్రొఫెసర్

హత్య కేసులో వ్యక్తికి యావజ్జీవ శిక్ష

- మరో నిందితురాలికి రెండేళ్ల జైలు
- ఎస్పీ యు.రవిప్రకాష్ వెల్లడి

సాక్షి, భీమవరం: ఇంట్లో ఒంటరిగా ఉంటున్న రిటైర్డ్ ఉపాధ్యాయినిని హత్య చేసిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు యాళ్ల విజయ్‌కుమార్ (నాని)కి జీవితకాల సాధారణ కారాగార శిక్ష, తిరుమణి రాముడు అనే మహిళకు రెండేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ భీమవరం మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి పి.శ్రీసత్యదేవి తీర్పునిచ్చినట్లు ఎస్పీ యు.రవిప్రకాష్ చెప్పారు. కేసు వివరాలను మంగళవారం భీమవరం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ వివరించారు. కాళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏలూరుపాడు చినపేట ప్రాంతానికి చెందిన బంటుమిల్లి స్వర్ణకుమారి తల్లి మానుకొండ కరుణమ్మ (82) ఉపాధ్యాయినిగా ఉద్యోగ విరమణ అనంతరం ఇంటి వద్ద కిరణా కొట్టు పెట్టుకుని జీవిస్తోంది. 2021 జూన్ 22వ తేది రాత్రి అనుమానాస్పదంగా కరుణమ్మ మరణించింది. స్వర్ణకుమారి ఫిర్యాదు మేరకు అప్పటి కాళ్ల ఎస్సై రాంబాబు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యాళ్ల విజయ్‌కుమార్ గతంలో దొంగతనాల కేసులలో నేరస్తుడు. ఒంటరిగా ఉంటున్న కరుణమ్మ ఇంటిలోనికి విజయకుమార్ ప్రవేశించి దుప్పటితో నోరునొక్కి హత్య చేశాడు. మృతురాలి చెవి బంగారు దిద్దులు అపహరించగా వాటిని అమ్మడానికి తిరుమాని రాముడు సహకరించింది. దీంతో అనుమానాస్పద మృతి కేసును హత్య కేసుగా మార్పు చేసి అప్పటి భీమవరం రూరల్ ఇన్‌చార్జి సీఐ బి.కృష్ణకుమార్ దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. అనంతరం అప్పటి భీమవరం రూరల్ సీఐ ఎ.నాగమురళి తదుపరి దర్యాప్తులో తగిన సాక్ష్యాధారాలతో చార్జిషీటు ఫైల్ చేసినట్లు ఎస్పీ రవిప్రకాష్ చెప్పారు. తన ప్రత్యేక పర్యవేక్షణలో భీమవరం మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు (స్పీడీ ట్రయిల్ కోర్ట్) త్వరితగతిన ట్రయిల్ నిర్వహించగా నిందితులపై నేరం రుజువు కావడంతో మంగళవారం జడ్జి శ్రీసత్యదేవి తీర్పునిచ్చారని ఎస్పీ రవిప్రకాష్ చెప్పారు. ఈ కేసును వేగంగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్షణ పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.


భీమవరంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రవిప్రకాష్

గడపగడపకు సంక్షేమం


కాళ్ల: పెదఅమిరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

గల్ఫ్ పంపుతానని మోసం

భీమవరం అర్బన్: గల్ఫ్ దేశం పంపుతానని డబ్బు కాజేసిన ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం కొవ్వాడ అన్నవరం గ్రామానికి చెందిన గూడాల లక్ష్మిని గల్ఫ్ దేశం పంపుతానని లక్కవరం గ్రామానికి చెందిన షేక్ రహీం రూ.1 లక్ష తీసుకుని పంపక పోవడంతో బాధితురాలు గూడాల లక్ష్మి పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై బి.మోహన్‌రావు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపుంజుల వేలం


మీడియాతో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ అన్నామణి

తాడేపల్లిగూడెం రూరల్: కోడిపందేల కేసులో స్వాధీనం చేసుకున్న 42 కోడిపుంజులకు గాను, 32 కోడి పుంజులకు మంగళవారం తాడేపల్లిగూడెం కోర్టు ఆవరణలో వేలం పాట నిర్వహించారు. 32 కోడి పుంజులకు గాను నాలుగు లక్షల 75వేల రూపాయలు వచ్చినని, దీనిని ప్రభుత్వ ఖజానాకు జమ చేయనున్నట్టు ఫస్ట్ క్లాస్ సెకండ్ అడిషనల్ జడ్జి అన్నామణి తెలిపారు. మిగిలిన 10 కోడిపుంజులకు బుధవారం వేలం పాట నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ నాగరాజు, రూరల్ ఎస్సై వీరభద్రరావు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

నిట్ డీన్ వీరేష్‌కుమార్

తాడేపల్లిగూడెం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్ అన్నారు. మంగళవారం నిట్‌లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రీడల వల్ల చక్కని ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. ఆరోగ్యాన్ని పెంచుకోవచ్చన్నారు. ఒలింపిక్స్ క్రీడల్లో వరుసగా భారతదేశానికి మూడు బంగారు పతకాలను అందించిన హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు క్రీడల్లో రాణించాలని డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్‌కే శాస్త్రి, డీన్ అకడమిక్ టి.కురుమయ్యలు అన్నారు. పరిపాలనా భవనం నుంచి మెయిన్ గేటు వరకు విద్యార్థులు ర్యాలీ జరిపారు. సాస్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డాక్టర్ కిరణ్ తీపర్తి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఎస్సై ఫిట్‌నెస్ పరీక్షలు


అభ్యర్థి ఛాతీ కొలుస్తున్న పోలీసు సిబ్బంది


పరుగు పరీక్షలో పాల్గొన్న ఎస్సై అభ్యర్థులు

850 మంది అభ్యర్థులు హాజరు, 519 మంది ఎంపిక

ఏలూరు టౌన్: ఎస్‌ఐ పోస్టుల ఎంపిక ప్రక్రియలో భాగంగా నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు మంగళవారం కొనసాగాయి. ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ పోటీలను పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్ట్, పరుగు 100 మీటర్లు, పరుగు 1600 మీటర్లు, లాంగ్ జంప్ వంటి పరీక్షలు నిర్వహించారు. ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి దేహదారుఢ్య పోటీలను పరిశీలించారు. ఈ పోటీలకు సంబంధించి సుమారుగా 1200 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, పోటీలకు 850 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పోటీలకు హాజరైన వారిలో 519 మంది అభ్యర్థులు అర్హత సాధించారని ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. దేహదారుఢ్య పరీక్షలు అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నామని, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. అభ్యర్థులు ఉదయం పోటీలకు హాజరయ్యే ముందు అల్పాహారం తీసుకుని రావాలని సూచించారు.

సోదరుడికి రాఖీ కట్టేందుకు వచ్చి..

ఆకివీడు: పుట్టిల్లు ఊరైన సోదరి గృహప్రవేశానికి వచ్చి సోదరుడికి రాఖీ కట్టేందుకు నిరీక్షిస్తున్న ఓ మహిళ మంగళవారం గ్రామంలో పంట కాలువలో బట్టలు ఉతుకుతూ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. విజయవాడలోని కృష్ణలంక ప్రాంతంలోని రణదీర్ వద్ద నివసిస్తున్న సురేఖ తన పుట్టిల్లు అయిన చెరుకుమిల్లిలోని తన సోదరి గృహప్రవేశానికి ఇటీవల వచ్చింది. గృహప్రవేశం పూర్తయిన తరువాత, ఆమె సోదరుడికి రాఖీ కట్టేందుకు గ్రామంలోనే ఉంది. మంగళవారం దుస్తులు ఉతుకుకునేందుకు పంట కాలువలోకి దిగగా ప్రమాదవశాస్తూ కాలువలోకి జారిపడింది. కాలువలో ప్రవాహం అధికంగా ఉండటంతో మునిగి కొట్టుకువెళుతుండగా, స్థానికులు చూసి బయటకు తీశారు. వెంటనే ఆమెను ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గృహప్రవేశం అయిన తర్వాత స్వగ్రామానికి వెళ్లి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని బంధువులు విలపిస్తున్నారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

వేద విద్యార్థులకు పరీక్షలు

గణపవరం: గణపవరం గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలో వేద విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. మూడు రోజులుగా వేద విద్యార్థులకు రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలలో ఉత్తీర్ణులైన వారికి రాఖీ పండుగ రోజున సర్టిఫికెట్లు అందజేస్తారు. వేదపండితులను సన్మానించి, ప్రోత్సాహకాలను ప్రముఖ దాత, ఆధ్యాత్మికవేత్త సాగిరాజు సుబ్బరాజు కుటుంబ సభ్యులు అందజేస్తారు.

విద్యార్థులు కూడా శాటిలైట్స్ తయారుచేయాలి


ఇస్రో పూర్వ శాస్త్రవేత్త కృష్ణమూర్తి

సాక్షి, భీమవరం: భారత శాస్త్రవేత్తలు ప్రయోగించిన చంద్రయాన్–3 ప్రయోగంతో ప్రపంచంలో ఇంత వరకు ఎవరూ సేకరించలేని విలువైన సమాచారాన్ని అందిస్తోందని ఇస్రో పూర్వ శాస్త్రవేత్త, తిరువనంతపురం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ వైవీఎస్ కృష్ణమూర్తి చెప్పారు. మంగళవారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆయన మాట్లాడారు. చంద్రయాన్–3 హైడ్రాక్స్ మాలిక్యుల్స్ వంటి ఎంతో విలువైన సమాచారాన్ని అందించిందని వెల్లడించారు. చంద్రయాన్–2 కూడా 25 సెంటీమీటర్ల రిజల్యూషన్‌లో మూన్‌ను మ్యాప్ చేసి పంపిస్తోందని, ప్రధానంగా ఉష్ణోగ్రతల వ్యత్యాసం వంటి సమాచారం చక్కగా అందిస్తోందన్నారు. కళాశాల స్థాయిలో కూడా స్టార్టప్ ఏకో సిస్టం అభివృద్ధి చేసి అధ్యాపకులు, విద్యార్థులు శాటిలైట్స్ తయారు చేసేలా ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మానవులు ఎదుర్కొంటున్న క్యాన్సర్ వంటి అనేక రుగ్మతలను గుర్తించడం, పర్యావరణ కాలుష్యం ఏ మేరకు పెరుగుతోంది తదితర అంశాలు అధ్యయనం చేసేందుకు విద్యార్థులు మినీ శాటిలైట్స్ రూపొందించవచ్చని, దానికి గాను తన వంతు సహకారం ఉంటుందని కృష్ణమూర్తి చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ దేశంలో ప్రతిష్టాకరమైన ఇస్రో శాస్త్రవేత్తగా పనిచేసిన కృష్ణమూర్తి కళాశాలకు వచ్చి విద్యార్థులకు సూచనలు, సలహాలు అందించడం స్పేస్ టెక్నాలజీ అభివృద్ధికి అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కృష్ణమూర్తిని పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. కళాశాల ఆర్అండ్‌డీ డీన్ పీఏ రామకృష్ణంరాజు పాల్గొన్నారు.


భీమవరంలో ఇస్రో పూర్వ శాస్త్రవేత్త కృష్ణమూర్తిని అభినందిస్తున్న దృశ్యం

ఉత్సాహంగా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ఏలూరు రూరల్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. అశ్మిత పేరుతో క్రీడలపై మహిళల్లో ఉత్సాహం, ఆశక్తి పెంచేందుకు ఏలూరు ఎస్ఎల్‌కేవీసీ (శాయ్ సెంటర్) ఈ పోటీలు చేపట్టింది. డీఎస్‌వీ వినాయక్‌ప్రసాద్ పర్యవేక్షణలో చేపట్టిన ఈ పోటీలను ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ ప్రారంభించగా, అంతర్జాతీయ లిఫ్టర్, అర్జున్ అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, బడేటి వెంకట్రామయ్య, చీఫ్ కోచ్ బి.శ్రీనివాసరావు విజేతలైన లిఫ్టర్లను అభినందించారు.


సర్టిఫికెట్లు అందుకున్న విజేతలు

విజేతలు వీరే

45 కేజీల విభాగంలో ఆర్.అను ప్రథమస్థానం, డి.మాలతి ద్వితీయస్థానం, ఆస్.రక్షిత మూడో స్థానంలో నిలిచారు. 49 కేజీల విభాగంలో ఎన్.సత్యవతి, ఆర్.రాశి, డి.అక్షయ, 55 కేజీల్లో కె.శివకుమారి, ఎల్.ఉషశ్రీ, 59 కేజీల విభాగంలో సీహెచ్ దేవి, ఎం.ఆశ, కె.హాసిని, 71 కేజీల విభాగంలో పి.హేమభార్గవి, బి.శ్రీలోహిత, 76 కేజీలలో సీహెచ్ ఉమ, 81 కేజీల విభాగంలో జి.రమ్యశ్రీ, 87 కేజీలలో కేఎస్ఆర్ లక్ష్మి, 89 ప్లస్ విభాగంలో యూకేఎస్ లక్ష్మి, ఆర్ఏ భవాని వరుస స్థానాల్లో గెలుపొందారని వెయిట్ లిఫ్టింగ్ కోచ్ భవాని వెల్లడించారు.

క్లుప్తంగా

బలుసులమ్మకు వెండి సమర్పణ


బలుసులమ్మకు వెండి సమర్పణ చేస్తున్న డాక్టర్ చిట్యాల సురేంద్రకుమార్ దంపతులు

తాడేపల్లిగూడెం: పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ వారికి ప్రముఖ వైద్యులు డాక్టర్ చిట్యాల సురేంద్రకుమార్, పద్మిని దంపతులు మంగళవారం అరకిలో వెండిని సమర్పణ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు వట్టిపోలు రాము తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్స్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి


ఎలక్ట్రికల్ యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న బండి దుర్గాప్రసాద్

తాడేపల్లిగూడెం: నిత్యం ప్రమాదాలతో ముడిపడి ఉన్న విద్యుత్ సంబంధిత పనుల్లో ఉన్న కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రగతి ఎలక్ట్రికల్ , ఎలక్ట్రానిక్ యూనియన్ బండి దుర్గాప్రసాద్ కోరారు. మంగళవారం పట్టణంలో ప్రగతి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ యూనియన్ (ఐఎఫ్‌టీయు)సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు నాయకులు దానవరప్రసాద్, సంఘ కార్యదర్శి శేఖర్, కోశాధికారి రాము పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి 36 మంది హాజరు


తణుకులో వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సజ్జాపురం శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన వైద్య శిబిరానికి 36 మంది రోగులు హాజరుకాగా, డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వైద్యసేవలందించి పాటించాల్సిన ఆహార నియమాలను వివరించారు. అనంతరం ఉచితంగా బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, తణుకు శాఖ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, కోశాధికారి అడ్డాల వెంకట కృష్ణారావు, కోసూరి గాంధీ, చేబ్రోలు సాధు, ఇవటూరి లక్ష్మణరావు పాల్గొన్నారు.

మొబైల్ షాప్స్ యూనియన్ కార్యవర్గ సమావేశం


తణుకులో నూతనంగా ఎన్నికైన యూనియన్ సభ్యులు

తణుకు: పట్టణంలో మొబైల్ షాపుల యూనియన్ నూతన కార్యవర్గ సమావేశం మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా ఆకుల సాయి, ఉపాధ్యక్షుడిగా కె.సూర్యకిరణ్, కార్యదర్శిగా శెట్టి నేతాజీ, సంయుక్త కార్యదర్శిగా ఐ.శివగణేష్, కోశాధికారిగా డీవీఎం కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వీరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దుకాణ యజమానులు, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

కేంద్రంలో మోదీ విఫలం

తాడేపల్లిగూడెం: కేంద్రంలో మోదీ ప్రభుత్వం నిరుద్యోగసమస్యను పరిష్కరించడంలో విఫలమైందని సీపీఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలపై భారాలు మోపుతుందన్నారు. కేంద్రప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆగస్టు 30 నుంచి సెప్టెంబరు నాలుగో తేదీ వరకు పట్టణంలో చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత

పాలకొల్లు అర్బన్: మండలంలోని దిగమర్రులో లివర్ క్యాన్సర్‌తో బాధపడుతూ మృతి చెందిన రాపాక సంతోష్‌కుమార్ కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష మంజూరైంది. ఈ చెక్కును సంతోష్‌కుమార్ భార్య లక్ష్మీకుమారికి మంగళవారం సర్పంచ్ రాపాక నగేష్‌కరుణాకర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండేటి మల్లికార్జునరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ లోకేష్ పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు గిడుగు వెంకట రామ్మూర్తి


తాడేపల్లిగూడెం:ఉద్యానవర్సిటీలో గిడుగు చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం


పెంటపాడులో 111మందికి తెలుగుభాషా కవుల చిత్రాలను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు


అత్తిలి:బల్లిపాడులో మాట్లాడుతున్న హెచ్‌ఎం దత్


పెంటపాడు: సమావేశంలో మాట్లాడుతున్న షేక్ బాబూజీ


తణుకు టౌన్: తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమంలోమాట్లాడుతున్న డాక్టర్ రామ్మోహనరావు


తాడేపల్లిగూడెం రూరల్:పెదతాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న దృశ్యం

అత్తిలి: వ్యవహారికా భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా మంగళవారం అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా ఘనంగా నిర్వహించారు. గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని వాడుక భాషగా తీసుకువచ్చిన సంస్కరణలో అగ్రగణ్యులు గిడుగు రామ్మూర్తి అని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్ చెప్పారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి, తెలుగుభాషకు ఆయన అందించిన సేవలను శ్లాఘించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం దత్ మాట్లాడుతూ తెలుగు భాషను వాడుక భాషలో అందరికీ అర్థమయ్యేరీతిలో ఆయన చేసిన సంస్కరణలె బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తించాయన్నారు. జీవితంలో ప్రతీక్షణాన్ని భాషా సంబంధమైన పరిశోధనలకే ఆయన వెచ్చించారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు తెలుగుతల్లి, గిడుగురామ్మూర్తిపంతులు వేషధారణలతో ఏకపాత్రాభినయం చేయడంతో పాటు తెలుగు ప్రాచీన ప్రస్తుత కవుల చిత్రపటాలతో మాతెలుగుతల్లికి మల్లెపూదండ అని పాడుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తణుకు నన్నయ భట్టారక పీఠం పూర్వ అధ్యక్షుడు శ్రీసుసర్మ, పాఠశాల సంస్కృత ఉపాధ్యాయుడు ఎస్ పురుషోత్తం, మండపాక తెలుగు ఉపాధ్యాయురాలు షేక్ షర్మిల, పాఠశాల సాహితీ సంఘ సభ్యులు, తెలుగు ఉపాధ్యాయులు రాంబాబు, ఆత్మలింగం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆకుల మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోయంకాలో ఘనంగా తెలుగుభాషా దినోత్సవ వేడుకలు

పెంటపాడు: తెలుగుభాషా ఔనత్యాన్ని విద్యార్థులు దశదిశలా చాటాలని రాష్ట్ర విద్యాపరిశోధన సభ్యులు డాక్టర్ షేక్ బాబూజీ పేర్కొన్నారు. పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం ఘనంగా భాషా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వరరావు ఆధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డాక్టర్ షేక్ బాబూజీ మాట్లాడుతూ తెలుగు భాష గొప్పదనాన్ని ప్రపంచదేశాలు తెలుసుకొనేలా విద్యార్థులు తెలుగుపట్ల ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలన్నారు. తద్వారా తెలుగును విశ్వవ్యాప్తం చేసేందుకు తమవంతు కృషిచేయాలన్నారు. తెలుగు కోసం పాటుపడిన కవులను ప్రత్యేకంగా కొనియాడారు. ఈ సందర్భంగా గిడుగు రాంమూర్తి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. కళాశాల తెలుగువిభాగ అధికారి డాక్టర్ సుంకర గోపాల్ ఆధ్వర్యంలో 111 మంది తెలుగు కవుల చిత్రాలను ఆవిష్కరించి విద్యార్థులతో స్థానిక కళాశాల ఆవరణలో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా పెంటపాడు కు చెందిన ముగ్గురు తెలుగుభాషా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

వ్యవహారిక భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పిన రామ్మూర్తి

తాడేపల్లిగూడెం రూరల్: తెలుగు వ్యవహారిక భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పిన మహనీయుడు గిడుగు వెంకట రామ్మూర్తి అని పెదతాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం అన్నారు. మంగళవారం మండలంలోని పెదతాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అన్నవరం మాట్లాడుతూ తెలుగు వచనాన్ని వ్యవహారిక భాషలో అర్థమయ్యే రీతిగా తీసుకొచ్చిన మహనీయుడు రామ్మూర్తి అని కొనియాడారు. అనంతరం క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలకు ఈదా నరసింహారావు తన తండ్రి జ్ఞాపకార్థం క్రీడా సామాగ్రిని అందజేశారు. అలాగే, స్వాతంత్ర్యోద్యమ వేడుకలను పురస్కరించుకుని క్రీడాపోటీల్లో ప్రతిభకనబర్చి విద్యార్థినులకు అత్తింటి సోమరాజు రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ఎస్‌కె.లాల్ బీబీ, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జీఎస్.హరిప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అద్భుతమైన భాష తెలుగు

తాడేపల్లిగూడెం: అక్షర సౌందర్యం,శబ్ద సౌందర్యం కలబోసిన అద్భుతమైన భాష మన తెలుగు భాష అని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ తోలేటి జానకీరామ్ అన్నారు. మంగళవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తెలుగుభాష వ్యవహారిక భాషగా ప్రాచుర్యం పొందడానికి గిడుగు రామ్మూర్తి పంతులు విశేష కృషి చేశారన్నారు. నిరక్షరాస్యులైన తెగలకు భాషా జ్ఞానం కలిగించారన్నారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, డీన్ ఆఫ్ హార్టీకల్చర్ డాక్టర్ ఎస్.పద్మావతమ్మ పాల్గొన్నారు.

తల్లివంటిది మాతృభాష

తాడేపల్లిగూడెం అర్బన్ : మాతృభాష తల్లివంటిదని మన మాతృభాష తెలుగును ప్రతీ ఒక్కరూ మక్కువతో అభ్యసన చేయాలని పలువురు వక్తలు విద్యార్థులకు సూచించారు. మాతృభాషా దినోత్సవం సందర్భంగా స్థానిక సుబ్బారావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యంద్రపాటి ధనలక్ష్మి, ఎరిచర్ల సుజాత, టి. చైతన్య, ఇవి కృష్ణారావు, డివి నారాయణవు, పి సుమంత్, శ్రీదేవి, వి పద్మజారాణి, వరలక్ష్మి, అమూల్య, మాణిక్యమ్మ , కన్నారెడ్డి, వల్లి, జరీనా. విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాతృభాషా దినోత్సవ వేడుకలు కార్యక్రమాన్ని కళాశాల ప్రధాన అధ్యాపకులు రమణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎం నిర్మల, సీహెచ్ లక్ష్మి,శిరీష, వెంకటేశ్వరరావు, బేగ్ శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మ కంటే మధురమైన భాష తెలుగు

తణుకు టౌన్: అమ్మ కంటే తెలుగు భాష మధురమైనదని డాక్టర్ రంకిరెడ్డి రామ్మోహనరావు చెప్పారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం తణుకులోని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కె రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, తెలుగు అధ్యాపకులు పి శివప్రసాద్, ఎస్ సుమ పాల్గొన్నారు. అంతర్జాతీయ క్రీడా దినోత్సవాన్ని మహిళా కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీడీ ఎం రత్నకుమారి, విద్యార్దినీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన తెలుగు భాసా దినోత్సవ వేడుకలలో సహస్ర అవదాని కోట లక్ష్మీనరశింహం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఏ మారుతీదేవి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. ఎస్సీఐఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. వెంకట్రాయపురం, పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమాల్లో గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకట్రాయపురం పాఠశాల హెచ్‌ఎం పెదపాటి గోపాల కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

అక్టోబరు 2 నుంచి 'ఆడుదాం ఆంధ్ర'


ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కర్రి విజయలక్ష్మి

తాడేపల్లిగూడెం అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి క్రీడలను ప్రోత్సహించే దిశగా అక్టోబర్ 2వ తేదీ నుంచి 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారని స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కర్రి విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పలు విషయాలపై చర్చించారు. విద్యార్థులు విద్యనభ్యసించడంతోపాటు క్రీడల్లో జాతీయ , అంతర్జాతీయ స్థాయికి రాణించాలన్నారు. సిఎం కప్పు పేరుతో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా పోటీలు అక్టోబరు 2వతేదీన నుంచి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదిశగా జిల్లాలోని 535 సచివాలయాల ద్వారా ఆడుదాం ఆంధ్రలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అండర్ -17 క్రికెట్ పోటీలకు ఎంపికైన వాణీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులను డైరెక్టర్ విజయలక్ష్మి అభినందించారు. ఈ కార్యక్రమంలో కర్రి భాస్కరరావు, వాణి స్కూల్ అధినేత వాణికృష్ణ, వాని సేవా సంస్థ అధ్యక్షుడు అభ్యుదయ, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమ పోటు నివారణకు మందులు పిచికారీ చేయొద్దు


తాడేపల్లిగూడెం మండలం నందమూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: దోమ పోటు నివారణకు ముందస్తుగా పురుగు మందులు పిచికారీ చేయవద్దని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని నందమూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్ మాట్లాడుతూ వరిపై అక్కడక్కడా నల్లి, సల్ఫైడ్ ప్రభావం కనబడుతుందన్నారు. అది కూడా తక్కువ మోతాదులోనేనని పేర్కొన్నారు. వీటి నివారణకు ముందస్తుగా మందులు పిచికారి చేయవద్దన్నారు. నల్లి నివారణకు ప్రొఫినోఫాస్ పిచికారి చేసుకోవాలన్నారు. సల్ఫైడ్ ప్రభావాన్ని తగ్గించడానికి రెండు, మూడుసార్లు నీరు మార్చాలని సూచించారు. తర్వాత ఎకరానికి 15 నుంచి 20 కిలోల పొటాష్ వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకే ఇన్‌చార్జ్ జాలపర్తి సతీష్, ఏఈవో మాధవ వర్మ, రైతులు దానయ్య, శివ, తదితరులు పాల్గొన్నారు.

తణుకులో 2కే రన్


తణుకులో 2కే రన్‌లో విజేతలు

తణుకు అర్బన్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం తణుకు ఎస్సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో 2కె రన్ నిర్వహించారు. ఈ 2కే రన్‌లో విజేతలకు పుట్టా ప్రసాద్, జక్కంశెట్టి ప్రసాద్, శ్రీసిటి ఎమర్జీన్సీ హాస్పిటల్స్, పత్తుల ఆశిష్ విక్టర్, సంకు దుర్గాప్రసాద్, చేగొండి రామకృష్ణ, బట్టు ధర్మారావు, దాకి ఝాన్సీలక్ష్మీబాయిల సహకారంతో మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందచేసినట్లు అసోసియేషన్ కార్యదర్శి సంకు సూర్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మానేపల్లి శ్రీనివాస్, మద్దాల శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఎస్‌వీవీ సత్యనారాయణ, కోశాధికారి కె.బాబూరావు, సహాయ కార్యదర్శి ఆర్.రామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు ఎఆర్ అప్పారావు, కె.సుబ్బారావు, బి.సుబ్రహ్మణ్యం, కె.శ్రీనివాస్, ఎ.నాగేశ్వరరావు, ఎం.నాగరాజ్యం, పి.జయమ్మ, టి.రజని పాల్గొన్నారు.

క్రీడలతో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారు


శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఆటలు ఆడుతున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం: క్రీడలతో మానసిక ఉల్లాసం కలిగి విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కర్రి విజయలక్ష్మి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం వాణీ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. వైసీపి నాయకులు కర్రి భాస్కరరావులు పాల్గొన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారిని సత్కరించారు.

శశిలో..

శశి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి క్రీడాకారులుగా మారి దేశానికి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ భానుప్రసాద్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ షేక్ సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను నూరుశాతం సాధించాలి


డీడీగా పదోన్నతి పొందిన విజయభాస్కర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

పెంటపాడు: ప్రభుత్వం నిర్దేశించిన పశుసంవర్ధక శాఖ లక్ష్యాలను సిబ్బంది సాధించాలని గూడెం డివిజన్ పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం పెంటపాడు పశుసంవర్ధకశాఖ డివిజన్ కార్యాలయంలో జిల్లా పశువైద్యుల సంఘ జిల్లా అధ్యక్షుడు, పెంటపాడు మండల పశు వైద్యాధికారి డాక్టర్ మహేష్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని పశువైద్యులు, లైవ్‌స్టాక్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన వై. విజయ భాస్కరరావును సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త ఆనందరావు, గూడెం మున్సిపల్ కమీషనర్ ఎ.శామ్యూల్ పాల్గొన్నారు.

వాసవి వనిత సేవలు ఆదర్శనీయం

తాడేపల్లిగూడెం అర్బన్ : వాసవి వనిత క్లబ్ నిర్వహిస్తున్న సమాజిక సేవలు అదర్శనీయమని అంతర్జాతీయ అధ్యక్షురాలు పొలకుర్తి గాయత్రి అన్నారు. తొలుత పట్టణంలోని వాసవిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గాయత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అధ్యక్షురాలు గాయత్రి వాసవి మాత ఆలయానికి రెండు ఏసీలు అందచేశారు. మానేపల్లి అరవింద్‌పావని సౌజన్యంతో నిరుపేదలైన ఇద్దరు యువతులకు రెండు కుట్టు మిషన్లు అందచేశారు. అనంతరం పేదవిద్యార్థులు ఐదుగురికి స్కాలర్‌షిప్‌లు, పేదలకు వృద్ధాప్యపు పింఛన్లు అందించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్యఅతిధి నాగసూరి మరళీమోహనరావు, గాదంశెట్టి వెంకటేశ్వర్లు, వాసవి క్లబ్ గౌరవాధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు, మండవల్లి నాగేంద్రరావు, ఒబిలిశెట్టి నటరాజు, నున్న సుందర్రావు, కారుమూరి సునీత, ముద్దుల కుమారి, కె.పద్మలత, పసుమర్తి సుధారాణి పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యం


పోలీస్ స్టేషన్ వద్ద ఎస్పీతో సిబ్బంది

యలమంచిలి: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ యు.రవిప్రకాష్ తెలిపారు. వార్షిక తనిఖీలో భాగంగా మంగళవారం ఆయన యలమంచిలి పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేసి, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేరాల అదుపునకు సిబ్బంది కృషి చేయాలన్నారు. క్రైమ్ రేట్ తగ్గించడంతోపాటు ప్రజల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నరసాపురం డీఎస్పీ రవి మనోహరాచారి, పాలకొల్లు రూరల్ సీఐ కొండవీటి శ్రీనివాస కుమార్, ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

నేడు మోదుగ గుంటలో గడప గడపకు కార్యక్రమం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మోదుగ గుంట గ్రామంలో బుధవారం సాయంత్రం 5 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొనే ఈ కార్యక్రమంలో అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వ కళాశాలలో క్రీడా దినోత్సవం


క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

తణుకు: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్ఎన్‌వీటీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీ జీఎంఎస్ కుమార్, అధ్యాపకులు భద్రరావు, శ్రీనివాసరావు, శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శేషుబాబుకు అభినందనల వెల్లువ


హౌసింగ్ బోర్డులో మాజీ ఎమ్మెల్సీ శేషుబాబు దంపతులను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: టీటీడీ పాలకమండలి డైరెక్టర్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్సీ మేక శేషుబాబును దంపతులను మంగళవారం పట్టణంలోని హౌసింగ్ బోర్డులో గౌడ సంఘం ఆధ్వర్యంలో అభినందన సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషుబాబు మాట్లాడుతూ తనకు ఈ పదవిని ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానాన్నరు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకుడు తాతా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ బీసీ నాయకుడు అడ్డాల నరసింహారావు, పార్టీ పట్టణ కార్యదర్శి చింతకాయల సత్యనారాయణ, యూత్ అధ్యక్షుడు చిటకన ప్రసాద్, దృశ్య శ్రవణ, రాష్ట్ర డైరెక్టర్ మానికొండ వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు దస్తగిరి, సుచిత్ర రెడ్డి, స్వామి, కుమార్ పాల్గొన్నారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి


మాలమహానాడు సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు

తణుకు టౌన్: భారత రిజర్వు బ్యాంక్ స్ఫూర్తి ప్రదాత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటి మిల్లి మంగరాజు కోరారు. మంగళవారం తణుకు హౌసింగ్ బోర్డు కాలనీలో జరిగిన మాల మహానాడు సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రిజర్వు బ్యాంక్ ఏర్పాటుకు కారకుడైన అంబేడ్కర్ ఫోటోను నోట్లపై ముద్రించకుండా రిజర్వు బ్యాంక్‌కు సంబంధం లేని నాయకులు ఫొటోలు కరెన్సీ, నాణేలపై ముద్రించి అంబేడ్కర్‌ను అవమానపరుస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రపతి, ప్రధాన మంత్రి ఈవిషయంలో కలగజేసుకుని భారత కరెన్సీ నోటుపై అంబేడ్కర్ ఫొటోను ముంద్రించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తిరగటి శివ, సారిపల్లి రామారావు, తూర్పు గోదావరి జిల్లా బీఎస్పీ అధ్యక్షుడు కే లోవరాజు, చిట్టూరి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు


నన్నయ్య క్యాంపస్‌లో ధ్యాన్‌చంద్ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అశోక్

తాడేపల్లిగూడెం: క్రీడా స్ఫూర్తి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతుందని నన్నయ్య ప్రాంగణం ప్రిన్సిపాల్ టి.అశోక్ కుమార్ మంగళవారం ప్రాంగణంలో జరిగిన ధ్యాన్‌చంద్ జయంతి కార్యక్రమంలో పిలుపినిచ్చారు. అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదల విలువల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిపార్టుమెంటు ఆఫ్ ఫార్మసీ స్పోర్ట్సుక్లబ్ చైర్మన్ హరిప్రసాద్, కోర్సు కో ఆర్డినేటర్ డాక్టర్ హీరాభట్టు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల ద్వారా ఆరోగ్యభారతావనిని నిర్మించుకోవచ్చు

అత్తిలి: మన దేశం 'ఆరోగ్యయువ భారత్' గా కొనసాగాలంటే ప్రతీ ఒక్కరూ క్రీడల్లో తప్పనిసరిగా పాలుపంచుకోవాలని, తద్వారా ఆరోగ్య భారతావనిని నిర్మించుకోవచ్చని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్ అన్నారు. భారత హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను మంగళవారం అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు హెచ్ రమేష్, ఉపాధ్యాయులు బాలసుబ్రహ్మణ్యం, ఎస్ పురుషోత్తం, శ్రీకాంత్, ప్రసాద్, మల్లేశ్వరరావు, బలరాం, నాగేశ్వరరావు, హర్షద్, సుజాత, లలిత, సుభద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.